క్లుప్తంగా

ఆర్థిక సాయం



గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామ పంచాయతీ మొద్దులగూడెం గ్రామంలో పిట్టల నర్సయ్య ఇల్లు ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహా నాయక్ సంఘటన స్థలానికి వచ్చి బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యం అందించారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. కలెక్టర్‌తో మాట్లాడి నర్సయ్య కుటుంబానికి ఇల్లు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆలూరి శ్రీనివాస్‌రావు, వెలిశాల స్వరూప, లావుడ్య రాంచందర్, ఓదేలు, భాస్కర్, గజ్జి ఎలేందర్, తాటికొండ శ్రీనివాస్ చారి, రమేశ్, వెంకన్న, శేఖర్, సమ్మయ్య, చంటి, సోమయ్య, వెంకట్రామ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కూలిన పెంకుటిల్లు

మంగపేట : మండల కేంద్రం పరిధిలోని పొదుమూరుకు చెందిన దాగం సత్యం పెంకుటిల్లు సోమవారం సాయంత్రం నేల కూలింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంటికి తాళం వేసి కుమారుడితో కలిసి కన్నాయిగూడెం మండలంలోని గుర్రేవులలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లారు. వారం రోజుల నుంచి కుర్తున్న వర్షాలకు తడిసిన పెంకుటిల్లు సాయంత్రం ఒక్కసారిగా నెలకూలింది. ఇంట్లో ఎవరులేకపోవడంతో ప్రమాదం తప్పింది.

బస్సును ఢీకొని ఒకరికి గాయాలు



ములుగు రూరల్: ఆర్టీసీ బస్సును ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని మల్లంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లికి చెందిన బత్తుల సురేందర్ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ములుగుకు బయలుదేరాడు. హనుమకొండ నుంచి ములుగు వైపు వస్తున్న బస్సు బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బస్సు వెనక ఢీ కొట్టి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

జనావాసంలోకి కొండచిలువ



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరులోని చికెన్ సెంటర్‌లోకి సోమవారం కొండచిలువ వచ్చింది. ఈ మేరకు గ్రామస్తులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాములు పట్టే భార్గవ్ చౌదరితో వారు అక్కడకు చేరుకున్నారు. అతను చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని బీట్ ఆఫీసర్లు చరణ్, వాసులతో కలిసి రాష్ట్ర సరిహద్దులోని బీరమయ్య గుట్ట సమీపంలో గల అడవిలో వదిలేశారు. కొండచిలువ పొడవు 12అడుగులు, 25 కేజీల బరువు ఉంటుందని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

పాముకాటుతో దుక్కిటెద్దు మృతి



వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో పాము కాటుకు దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు గజ్జల సమ్మయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య రెండు దుక్కి టెద్దులను మేతకోసం సమీపంలోని అడవిలోకి తోలుకెళ్లాడు. మేత మేస్తుండగా దుక్కిటెద్దు నోటి నుంచి నురుగలు రావడం చూసి పాము కాటు వేసిందని గ్రహించి స్థానిక పశువైద్యశాలకు తీసుకొచ్చాడు. ఆ సమయంలో పశువైద్యశాల తెరువకపోవడంతో ఇంటికి తోలుకెళ్లాడు. ఇంటికి వెళ్లిన అరగంట తరువాత దుక్కిటెద్దు మృతి చెందింది. దాని విలువ సుమారుగా రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

చేతిపంపు నీరే దిక్కు!

ఆశ్రమ పాఠశాలలో నిరుపయోగంగా 'బోరు'
- నీటి కోసం ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



చేతిపంపు వద్ద నీరు తాగుతున్న విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) మరమ్మతులకు నోచుకుని బోరు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని బయ్యక్కపేట ఆశ్రమ పాఠశాలలో బోరు మోటార్‌కు మరమ్మతు చేయకపోవడంతో విద్యార్థులకు చేతిపంపు నీళ్లే దిక్కవుతోన్నాయి. పాఠశాలలో సుమారుగా 110 మంది ఆదివాసీ గొత్తికోయ బాల, బాలికలు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఉన్న బోరు మోటార్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాఠశాల ఆవరణలో ఉన్న చేతి పంపు నీటిని విద్యార్థులు తాగుతున్నారు. స్నానాలకు, మాల, మూత్ర విసర్జనకు చేతి పంపు నీటిని బాలికలు బాకెట్ల ద్వారా తీసుకెళ్లి అవసరాలను తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బాలురు మాల విసర్జనకు పాఠశాల సమీపంలోని వాగు వద్దకు వెళ్తున్నారని గ్రామస్తులు తెలిపారు. వర్షకాలంలో వాగు ప్రాంతాలకు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. చేతి పంపు వద్ద కనీసం ప్లాట్ ఫాం కూడా నిర్మించకపోవడంతో నీరు నిల్వ ఉండి అధ్వానంగా కనిపిస్తుంది. చేతి పంపు వద్ద మురికి నీటితో విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పాఠశాల తెరుచుకుని 48 రోజులు గడిచిన బోరుమోటార్ మరమ్మతులకు నోచుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుమోటార్‌ను మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులపై పట్టింపేది?

పాఠశాలలోని విద్యార్థులపై అధికారులకు పట్టింపు లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం సెలవు కావడంతో పాఠశాలలో వంట మనుషులు, పాఠశాలలోని పని చేస్తున్న ఏఎన్‌ఎం మాత్రమే ఉన్నారు. వారి ఆలనాపాలనా చూసే వారు లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల సమీపంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి దానిపై తిరగడం, మరికొంత మంది విద్యార్థులు పాఠశాల దాటి బయటకు వెళ్లి రోడ్ల వెంట తిరగడం కనిపించింది. సెలవు రోజున విద్యార్థులను కట్టడి చేసే వారే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం మొత్తం 40 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. మారుమూల ప్రాంతంలో పాఠశాల ఉండడంతో గిరిజన సంక్షేమశాఖ అధికారులు పర్యవేక్షించిన దఖలాలు లేవని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఐటీడీఏ కార్యాలయానికే అధికారులు పరిమితవుతున్నారు తప్ప పాఠశాలను సందర్శించి విద్యార్థుల కావాల్సిన కనీస సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో త్వరలో బదిలీల జరగనుండంతో విద్యార్థుల సమస్యలను అధికారులు గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి.

వైద్యశిబిరాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధుల నివారణ కోసం మండలంలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున మండలంలోని ప్రజలు వ్యాధుల భారిన పడి వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని అన్నారు. మండలంలోని బంధాల, లవ్వాల, కొండపర్తి, కాటపూర్ గ్రామాలలో డెంగీ, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధులను నివారించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్ధిరెడ్డి, జగదీశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భూషబోయిన రవికుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు పిట్టల మహేందర్, నేతాజీ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఏటూరునాగారం: రొయ్యూర్ వద్ద తనిఖీ చేస్తున్న ఎస్సై తాజొద్దీన్



వాజేడు: కారును సోదా చేస్తున్న పేరూరు ఎస్సై

ఏటూరునాగారం: మావోయిస్టుల బంద్ నేపథ్యంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రొయ్యూర్ 163 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేశారు. దామరతోగు ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ సోమవారం ములుగు, భూపాలపల్లి జిల్లాల బంద్‌కు మావోయిస్టులు పిలుపునివ్వడంతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం విస్తృత తనిఖీ చేపట్టారు. మావోయిస్టులు ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశం ఉండడంతో పోలీసు బలగాలు అప్రమత్తమై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

వాజేడు: పోలీసులు మండలంలో సోమవారం తనిఖీలను ముమ్మరం చేశారు. వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామం వద్ద వాహన తనిఖీలను చేపట్టగా పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అయ్యవారిపేట గ్రామ సమీపంలో వాహన తనిఖీలను చేశారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులో తరలిస్తున్న వస్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. మావోల వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలను చోటు చేసుకోకుండా చూస్తున్నారు. వాహనాల్లో తరలుతున్న వారి వివరాలను సేకరించడంతో పాటు వారి చిరునామాలను తీసుకుంటున్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ



మంగపేట: రేగులగూడెంలో..

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామచంద్రాపురం, రాచపల్లి, వీరభద్రవరం, ఉప్పేడు వీరాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సోహల్, వినయ్, అశీష్, స్నేహ, సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని రేగులగూడెం గొత్తికోయ కాలనీలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారితో కలిసి సోమవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలం ముగిసే వరకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పంచాయతీ కార్యదర్శి పాషా ఆధ్వర్యంలో గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవితేజ, ఏఎన్‌ఎం జయలక్ష్మి, ఆశవర్కర్ సుజాత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శిరీష సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

ములుగు రూరల్ : ఖమ్మం జిల్లాలో ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని రాష్ట ఉపాధ్యాయ సంఘం ములుగు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరువ సతీష్ కుమార్, ఏళ్ల మధుసూదన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు విద్యార్థి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధి కోసం ఎంతో మంది ఉపాధ్యాయులు అనేక రకాలుగా కృషి చేస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలనే ఉద్దేశ్యంతో కొన్ని సందర్భాల్లో విద్యార్థులను దండించాల్సి వస్తుంది అన్నారు. అటువంటి పరిస్థితుల్లో విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. క్రమశిక్షణలో పెట్టకపోతే విద్రోహశక్తులుగా మారే ప్రమాదం ఉంటుంది అన్నారు. శిరీష పై సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని వారు అన్నారు.

చేయూత

వాజేడు: మండల కేంద్రానికి చెందిన వాసం సుస్మితకు సోమవారం అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పీర్ల కృష్ణబాబు చేయూతనందించారు. సుస్మితకు గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో జీఈఈలో సీటు వచ్చింది. తన చదువు కోసం ఆర్థికంగా దాతలు ఆదుకోవాలని సుస్మిత, ఆమె తల్లిదండ్రులు దాతలను వేడుకున్నారు. దీంతో అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణబాబు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథప్రసాద రాజు, సొసైటీ ఉపాధ్యక్షుడు వత్సవాయి జగన్నాథరాజు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఆదివాసీ సంఘాల, ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ గూడెల్లో ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, మునేశ్వరావు, సోమరాజు, రామచందర్, సతీష్, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం



పౌష్టికాహారాన్ని అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

గోవిందరావుపేట: మండలంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలకు సోమవారం నెమలి ఉదయ్ జయంతి సందర్భంగా నెమలి ఉదయ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ అధికారిక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జన్ను రవి హాజరై మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. నేటి యువత నెమలి ఉదయ్‌ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమగ్ర శిశు సంరక్షణ పథకం మండల సూపర్‌వైజర్ అనంత లక్ష్మీ, ఉపాధ్యాయులు కొర్ర రఘు రామ్, జెట్టి సోమయ్య, వావిలాల స్వామి, జంపాల శేకర్, గణపాక సుధాకర్, నెమలి గాంధీ, మునగాల వెంకన్న, జంగిడి ప్రకాశ్, సన్నగుండ్ల వెంకన్న, నెమలి బాలకృష్ణ, సాయిప్రసన్న పాల్గొన్నారు.

చల్వాయిలో వారసంత ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



సంతను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జవహర్ రెడ్డి

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో వారసంత నిర్వహించకపోవడంతో 'సాక్షి'లో 'కనుమరుగైన వారంతపు సంత' అనే శీర్షికను గత నెలలో ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి స్పందించిన చల్వాయి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ జవహర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి చుంచు భారతీలు చొరవ తీసుకోని గ్రామసభలో సంత నిర్వహణ, ఏర్పాట్లపై గ్రామ ప్రజల సమక్షంలో తీర్మానం చేశారు. ప్రతి సోమవారం సంత జరిగేలా చర్యలు చేపట్టడంలో భాగంగా గెస్ట్ హౌస్ ప్రాంగణంలో పిచ్చి చెట్లను తొలగించి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి వ్యాపారస్తులకు, కొనుగోలు దారులకు అనుకూలంగా సంతను నిర్వహించేలా పనులను ఆదివారం వరకు పూర్తి చేశారు. సోమవారం ఎంపీడీఓ జవహర్‌రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి వారంతపు సంతను ప్రారంభించారు. దీంతో 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ తేళ్ల హరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి, సామ రాంరెడ్డి, దరావత్ రంజీత్, చిక్కుల వెంకటేష్, చుక్క గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

'వెయ్యి కోట్ల బడ్జెట్ ప్రకటించాలి'



సమావేశానికి హాజరైన ఆటోడ్రైవర్లు

ములుగు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించే రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల సంక్షేమానికి రూ.వెయ్యికోట్ల బడ్జెట్ ప్రకటించాలని ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆటో యూనియన్ జిల్లాస్థాయి అత్యవసర సమావేశం యూనియన్ రాష్ట కార్యదర్శి వేల్పుల నరేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 31న అసెంబ్లీలో వినతి పత్రం ఇచ్చేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. డ్రైవర్లకు ఇన్సూరెన్స్, బీమా, హెల్త్ కార్డుల సదుపాయాన్ని కల్పించాలన్నారు, ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హైమద్ హరీశ్, ఓంకార్‌చారీ, కిరణ్, తిరుపతి, కుమార్, సాయి, సందీప్, నరేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి



వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన మళ్లీ రహదారిపైకి చేరిన వరద నీరు

వాజేడు: తగ్గి నట్టే తగ్గిన గోదావరి వరద సోమవారం మళ్లీ పెరిగింది. గోదావరి నీటిలో ముంపునకు గురైన రహదారులు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని ఇక రహదారి సౌకర్యానికి ఇబ్బందులు లేవు అనుకునే లోపే సోమవారం ఉదయం 10గంటల నుంచి క్రమేపీ వరద పెరిగింది. మళ్లీ రహదారులపైకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురిసిన వర్షాల కారణంగానే గోదావరిలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో మళ్లీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

మావోయిస్టులకు సహకరించొద్దు



ఎస్ఎస్ తాడ్వాయి: గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: మావోయిస్టులకు గొత్తికోయాలు సహకరించొద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బయ్యక్కపేట అటవీ ప్రాంతంలోని ముసలమ్మపెంట గొత్తికోయల గూడెంలో సోమవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గూడెంలోని ప్రతీ ఇంటిని తనిఖీ చేసి వివరాలను సేకరించారు. అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు. అనుమానంగా కనిపించిన వారిని విచారించారు.

వాజేడు: మావోయిస్టుల వారోత్సవాలు నేపథ్యలో సోమవారం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ కడేకల్ గ్రామంలో, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ గుమ్మడిదొడ్డి గ్రామంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మావోల కదలికలు ఏ మాత్రం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గోవిందరావుపేట: పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడిశెలకుంట గొత్తికోయగూడెంను సోమవారం ఎస్సై కమలాకర్ సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరిజన ప్రజలతో మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని బండ్లపహాడ్ గొత్తికోయగూడెంను ఎస్సై జక్కుల సతీశ్ సందర్శించి ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొత్తికోయలతో ఎస్సై మాట్లాడుతూ.. మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో గూడెంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రెండు రోజులుగా అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆఅనంతరం వెంగళాపూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న ఎస్సై రుద్రారపు హరీశ్



వెంకటాపురం(ఎం): బండ్లపహాడ్‌లో..



గోవిందరావుపేటలో..

హామీలు నెరవేర్చాలి



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

మంగపేట: తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వాములై పోరాడిన ఉద్యమకారులకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఉద్యమకారులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నిక సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ సాధన ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు గౌరవవేతనంగా నెలసరి రూ.25,000 పింఛన్ ఇవ్వాలన్నారు. ఏడుకొండలు, సంతోష్, వాసుదేవమూర్తి, సయ్యద్ హుస్సేన్, కౌసర్‌పాష, శ్రీనివాస్, కేశవరావు, లింగయ్య, అహ్మద్, నరేందర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944